



విద్యుత్ స్తంభం కూలడంతో రోడ్డుపైనే ఆగిపోయిన బస్సు

గెలుపోటములపై బెట్టింగ్ జోరు

- పట్టణ, గ్రామీణ ప్రాంతాలని తేడా లేదు..! - రూ.లక్షల నుంచి రూ.కోటి వరకు బెట్టింగ్

ప్రజాశక్తి-ఆదోనిరూరల్

జిల్లాలో పొలిటికల్ బెట్టింగ్ ఊపందకుంది. ఈనెల 13న సార్వత్రిక ఎన్నికల పోలింగ్ జరిగింది. సార్వత్రిక ఎన్నికల ఫలితాల ప్రకటనకు గడువు సమీపిస్తున్న కొద్దీ ఫలితాలపై బెట్టింగుల జోరు పెరుగుతోంది. ఈ నేపథ్యంలో ఫలితాలపై ఉత్కంఠ నెలకొంది. పోలింగ్ శాతం పెరగడంతో ఓటరు నాడి అంచనా వేయడం కష్టతరంగా మారింది. పోలింగ్‌కు, ఫలితాలకు మధ్య మూడు వారాల వ్యవధి ఉండడంతో జూదరులకు వరంగా మారింది.

సాధారణ ప్రజల్లో సైతం గెలుపోటములపై చర్చ నడుస్తోంది. పట్టణ, గ్రామీణ ప్రాంతాలని తేడా లేకుండా గెలుపోటములపై రూ.లక్షల నుంచి రూ.కోటి వరకు బెట్టింగ్ పెడుతున్నారు. ఏ నియోజకవర్గలో ఎవరు గెలుస్తారంటూ స్నేహితులు, బంధువులు, సహోద్యోగులు ఫోన్లు చేసి ఆరా తీస్తున్నారు. గత ఎన్నికలతో పోల్చి ప్రస్తుత పోలింగ్ సరళి ఎవరికి అనుకూలంగా ఉంటుందో విశ్లేషిస్తున్నారు. నిన్న, మొన్నటి వరకూ కేవలం క్రికెట్ మ్యాచ్‌లకు పరిమితమైన బెట్టింగ్ ఇప్పుడు రాజకీయాల్లోకి కూడా వచ్చింది. ఆదోని నియోజకవర్గంలో ఎమ్మెల్యే వై.సాయిప్రసాద్ రెడ్డి, కూటమి అభ్యర్థి పార్థసారథి, ఎమ్మిగనూరు నియోజకవర్గం బీవీ.జయ నాగేశ్వరరెడ్డి, బుట్టా రేణుక గెలుపోటములపై బెట్టింగ్‌కు దిగుతున్నారు. అలాగే ఆలూరు నియోజకవర్గంలో వీరభద్ర గౌడ్, బి.విరుపాక్షి, మంత్రాలయం నియోజవర్గంలో రాఘవేంద్ర రెడ్డి, ఎమ్మెల్యే బాల నాగిరెడ్డి, పత్తికొండ నియోజకవర్గం శ్యాం బాబు, ఎమ్మెల్యే శ్రీదేవి గెలుపోటములపై జోరుగా పందేలు కడుతున్నారు.

రూ.లక్ష నుంచి రూ.కోటి వరకు

రూ.లక్షలతో ప్రారంభమైన బెట్టింగ్‌లు రూ.కోట్లకు చేరుతున్నాయి. ప్రభుత్వం మారుతుందని ఒకవైపు, మరోవైపు అభ్యర్థుల గెలుపు, ఈ రెండింటినీ మించి ప్రధాన పార్టీ అధినేతల మెజారిటీపైనా బెట్టింగులు సాగుతున్నాయి. ప్రధాన పార్టీలైన వైసిపి, కూటమి మధ్యే రసవత్తర పోరు సాగుతోంది. గతంలో పోలింగ్ జరిగిన మరునాటికి ఏ పార్టీ గెలుస్తుంది, ఏ పార్టీ అధికారంలోకి రావచ్చన్నది పోలింగ్ సరళి ఆధారంగా విశ్లేషకులు చెప్పగలిగే వారు. కానీ ఈ దఫా ఎన్నికల్లో విశ్లేషకులు సైతం ఓటరు నాడీ పట్టలేకపోతున్నారు. దీనికి తోడు పోలింగ్ సమయం ముగిసిన తర్వాత ఓటర్లు పోలింగ్ బూత్‌ల వద్ద బారులు తీరడం, ప్రజలు ఓపికగా ఓటు హక్కును వినియోగించుకోవడం, పోస్టల్ బ్యాలెట్లను గతం కంటే ఎక్కువగా ఉద్యోగులు ఉపయోగించుకోవడం, ఇతర ప్రాంతాల్లో ఉన్న వారు సైతం ఓటింగ్‌కు తరలిరావడం ఈ ఎన్నికల్లో ప్రత్యేకతలుగా భావిస్తున్నారు. వాస్తవానికి ఓటింగ్ శాతం పెరిగిందంటే ప్రభుత్వంపై వ్యతిరేకతేనన్న సంకేతాలుగా చెప్పేవారు. కానీ ఈ దఫా ఎన్నికల్లో పెరిగిన ఓటరు చైతన్యం ప్రభుత్వానికి అనుకూలమని వైసిపి అంటుంటే, కచ్చితంగా ప్రభుత్వంపై వ్యతిరేకతేనని కూటమి చెబుతోంది. దీనిపై విశ్లేషకులు కూడా స్పష్టంగా మాట్లాడలేని పరిస్థితి ఉంది.



కొనసాగుతున్న బెట్టింగ్‌ల జోరు

ఆదోని డివిజన్ పరిధిలోని మండలాల్లో ఎన్నికల ఫలితాలపై గణనీయంగా బెట్టింగ్‌లు సాగుతున్నాయి. గతం కంటే భిన్నంగా పెద్దమొత్తంలో జూదరులు రంగంలోకి దిగినట్లు చెబుతున్నారు. నియోజకవర్గంలో వైసిపి గెలుస్తుందని, కాదు కూటమి గెలుస్తుందని, రాష్ట్రంలో కూటమి అధికారంలోకి వస్తుందని కొందరు పందెం కాస్తుంటే, వైసిపి మళ్లీ అధికారంలోకి వస్తుందని మరికొందరు పందెం కాస్తున్నారు. ఈ రెండింటినీ మించి టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి లోకేష్, జనసేన అధినేత పవన్ కల్యాణ్ మెజారిటీ కంటే సిఎం జగన్ మెజారిటీనే ఎక్కువ ఉంటుందని మరో గ్రూపు పందేలు కాస్తున్నట్లు సమాచారం. ఇప్పటికే కోట్లాది రూపాయల బెట్టింగ్‌లు సాగుతున్నట్లు తెలిసింది. ఈ పందేల జోరు రోజురోజుకూ పెరగడం విశేషం. వాస్తవానికి నియోజకవర్గంలో, మండలంలో వైసిపికి మెజారిటీ వస్తుంది. అలాంటిది ఈ దఫా అక్కడ కూడా కూటమి గెలుస్తుందన్న పందేలు పెరగడం చర్చనీయాంశమైంది.

ఉరుములు, మెరుపులతో

గాలి వాన బీభత్సం

- నేల కూలిన చెట్లు, స్తంభాలు
- తెగిపడిన తీగలు, పడిపోయిన ట్రాన్స్‌ఫార్మర్లు
- సుమారు రూ.80 లక్షల ఆస్తి నష్టం

గోనెగండ్ల మండలంలో శుక్రవారం రాత్రి ఉరుములు, మెరుపులతో కూడిన గాలివాన బీభత్సం సృష్టించింది. చెట్లు, విద్యుత్ స్తంభాలు నేలకూలాయి. ట్రాన్స్‌ఫార్మర్ పడిపోగా, విద్యుత్ తీగలు తెగిపడ్డాయి. సుమారు రూ.80 లక్షల ఆస్తినష్టం వాటిల్లింది.

వార్త 6వ పేజీలో

డిగ్రీ పరీక్షల్లో ముగ్గురు డీబార్

ప్రజాశక్తి - కర్నూలు కలెక్టరేట్

రాయలసీమ యూనివర్సిటీ పరిధిలో జరిగిన డిగ్రీ సెమిస్టర్ పరీక్షల్లో ముగ్గురు విద్యార్థులు డిబార్ అయినట్లు వర్సిటీ పరీక్షలు విభాగం ఉన్నతాధికారులు వెల్లడించారు. రెండవ సెమిస్టర్ పరీక్షకు 90 శాతం హాజరు కాగా నాలుగో సెమిస్టర్‌కు 90 శాతం హాజరు నమోదు అయిందని వెల్లడించారు.

కొనసాగిన 'పది' సప్లిమెంటరీ పరీక్షలు

ప్రజాశక్తి - కర్నూలు కలెక్టరేట్

పదో తరగతి సప్లమెంటరీ పరీక్షలు శనివారం రెండో రోజు కూడా కొనసాగాయి. జిల్లాలో మొత్తం 378 మంది విద్యార్థులు హాజరు కాగా మంది 778 విద్యార్థులు గైర్హాజరయ్యారు. జిల్లా వ్యాప్తంగా 20 పరీక్ష కేంద్రాల్లో సిట్టింగ్, ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాలు తనిఖీలు చేసినట్లు జిల్లా విద్యాశాఖ అధికారి కె.శామ్యూల్ వెల్లడించారు. ఎలాంటి మాల్ ప్రాక్టీస్ చోటు చేసుకోలేదని పేర్కొన్నారు.

ఇంటర్‌లో ఇద్దరు డీబార్

ఇంటర్మీడియట్ సప్లమెంటరీ పరీక్షలు శనివారం నాడు రెండో రోజు జరిగిన పరీక్షలో కర్నూలులో ఇద్దరు విద్యార్థులు మాస్ కాపీయింగ్‌కు పాల్పడుతుండగా డీబార్ చేశారు. ఉదయం ప్రథమ సంవత్సరం విద్యార్థులకు పరీక్ష నిర్వహించగా 8,970 మంది విద్యార్థులు హాజరు కాగా 315 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారని ఆర్ఐఒ ఎస్‌విఎస్ గురువయ్య శెట్టి వెల్లడించారు. మధ్యాహ్నం ద్వితీయ సంవత్సరం విద్యార్థులకు పరీక్ష నిర్వహించగా 830 మంది విద్యార్థులు హాజరు కాగా 76 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారని పేర్కొన్నారు.

మరింత అప్రమత్తంగా ఉండాలి

- కలెక్టర్ డాక్టర్ జి.సృజన

ప్రజాశక్తి - కర్నూలు కలెక్టరేట్

రాయలసీమ యూనివర్సిటీలో 4న కౌంటింగ్ నిర్వహించనున్న సందర్భంగా బందోబస్తు కొరకు రూపొందించుకున్న ప్రణాళికలను పక్కాగా అమలు చేయడంతో పాటు అప్రమత్తంగా ఉండాలని జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి డాక్టర్ జి.సృజన పోలీస్ అధికారులను ఆదేశించారు. శనివారం జిల్లా భద్రతా ప్రణాళిక అమలుపై పోలీస్, సంబంధిత జిల్లా అధికారులతో జిల్లా కలెక్టర్, ఎస్పీ కృష్ణకాంత్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ కర్నూలు జిల్లాలో పోలింగ్ చాలా ప్రశాంతంగా జరిగిందని, ఇప్పటివరకు ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోలేదని అందుకు నిరంతరం శాంతిభద్రతల కోసం శ్రమించిన జిల్లా ఎస్పీ, పోలీస్ అధికారులు, సిబ్బందిని కలెక్టర్ అభినందించారు. కౌంటింగ్ వరకు విధులు మరింత బాధ్యతతో నిర్వర్తించి జిల్లాలో కౌంటింగ్ ప్రక్రియ సాఫీగా జరిగే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు. కర్నూలు జిల్లా చుట్టుపక్కల సున్నితమైన ప్రాంతాలు ఉన్నాయని, బందోబస్తు కోసం ఏ విధంగా అయితే ప్రణాళికలు రూపొందించుకున్నారో వాటిని పక్కాగా అమలు చేయడంతో పాటు అప్రమత్తంగా ఉండాలని పేర్కొన్నారు. కౌంటింగ్ విధులకు కేటాయించిన సిబ్బంది యొక్క వివరాలు, ఫోటోలను పోలీస్ అధికారులకు ఇవ్వాలని సంబంధిత రిటర్నింగ్ అధికారులను ఆదేశించామని, సంబంధిత కౌంటింగ్ సిబ్బంది ఫోటోలను చూసి పోలీస్ సిబ్బంది వారిని గుర్తుపట్టడానికి సులువుగా ఉంటుందని కలెక్టర్ పేర్కొన్నారు. బందోబస్తుకు, పార్కింగ్ సమస్యలు తలెత్తకుండా ఎన్నికల కౌంటింగ్ విధులు నిర్వహించే సిబ్బంది అందరిని కలెక్టరేట్ నుండి ఉదయం 5 గంటలకు వాహనంలోనే రాయలసీమ యూనివర్సిటీ వద్దకు తీసుకొని వచ్చే విధంగా చర్యలు తీసుకుంటున్నామన్నారు. ప్రతి నియోజకవర్గానికి పార్కింగ్ ప్రదేశం వద్ద ఏజెంట్ ఐడెంటిఫికేషన్ కేంద్రాన్ని ఏర్పాటు చేస్తామని, కౌంటింగ్ రోజున అభ్యర్థులు నియమించుకున్న ఏజెంట్లు వస్తున్నారా? ఇతరులు వస్తున్నారా? అనే విషయాన్ని సంబంధిత కౌంటర్ వద్ద రిటర్నింగ్ అధికారులు పరిశీలన చేసుకోవడంతో పాటు వారికి ఇచ్చిన ఫార్మ్ అని తీసుకొని వచ్చారో లేదో పరిశీలన చేసి కౌంటింగ్ హాల్‌లోకి అనుమతిస్తామని తెలిపారు. మండల హెడ్ క్వార్టర్స్ లో ఎగ్జిక్యూటివ్ మెజిస్ట్రేట్ అందుబాటులో ఉండే విధంగా చర్యలు తీసుకుంటామని, కౌంటింగ్ విధులకు సిబ్బందిని కేటాయించిన అనంతరం మిగిలి పోయిన వారిని ప్రతి మండల హెడ్ క్వార్టర్‌లో ఉండే విధంగా ప్రొసీడింగ్స్ తయారు చేయాలని ఆదేశించారు. జిల్లా ఎస్పీ మాట్లాడుతూ... రాజకీయ ఆధిపత్యం, పోలింగ్ రోజు జరిగిన సంఘటనలు మొదలైన వాటి ఆధారంగా కర్నూలు జిల్లా పోలీసు యంత్రాంగం జిల్లాలో మొత్తం 188 సున్నితమైన ప్రాంతాలను గుర్తించారని, కౌంటింగ్ రోజున ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఉండేందుకు అన్ని సున్నితమైన ప్రాంతాల వద్ద స్టాటిక్ పోలీస్ పికెట్‌లను ఏర్పాటు చేశామన్నారు. కర్నూలులోని రాయలసీమ యూనివర్శిటీ కౌంటింగ్ హాల్‌కి ఎంట్రీ అయ్యేందుకు కర్నూలు, ఎమ్మిగనూరు, ఆదోని, పత్తికొండ పట్టణాలకు సంబంధించిన ముఖ్యమైన జంక్షన్‌లలో 31 చెక్ పోస్ట్‌లను ఏర్పాటు చేశామన్నారు. సిఐ, ఎస్ఐ నేతత్వంలో పెట్రోలింగ్ నిర్వహించే విధంగా 57 క్యూఆర్‌టిలను, 10 నుండి 12 సమస్యాత్మక గ్రామాలను ఎఎస్ఐ, హెడ్ కానిస్టేబుల్ నేతత్వంలో కవర్ చేసే విధంగా 67 రూట్ మొబైల్ టీమ్‌లను, షాడో పార్టీలను ఏర్పాటు చేశామన్నారు. 8 టియర్ గ్యాస్ టీమ్‌లు 8 అసెంబ్లీ నియోజకవర్గాలకు పంపుతామన్నారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీలు నాగరాజు, నాగబాబు, జిల్లా అధికారులు, పోలీస్ అధికారులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ డాక్టర్ సృజన. చిత్రంలో ఎస్పీ కృష్ణకాంత్



కర్నూలు స్టేడియంలో అథ్లెటిక్ సమ్మర్ క్యాంపును పరిశీలిస్తున్న చీఫ్‌కోచ్ భూపతిరావు

సమ్మర్ కోచింక్ క్యాంపును పరిశీలించిన చీఫ్‌కోచ్

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ అవుట్‌డోర్ స్టేడియంలో నిర్వహిస్తున్న కర్నూలు అథ్లెటిక్ సమ్మర్ కోచింగ్ క్యాంపును డిఎస్‌డిఒ చీఫ్‌కోచ్ భూపతిరావు శనివారం పరిశీలించారు. భూపతిరావు పిల్లలనుద్దేశించి మాట్లాడుతూ సమ్మర్ క్యాంప్ చక్కగా నిర్వహిస్తున్నారని అభిప్రాయం వ్యక్తం చేశారు. పిల్లలకు మంచి శిక్షణ ఇవ్వాలని, స్పోర్ట్స్ అథారిటీ పిల్లకు అన్నిసదుపాయాలు కల్పిస్తుందని అన్నారు. పిల్లలకు కావలసిన మంచినీటి సదుపాయం, క్రీడా సామాగ్రి, మెడికల్ కిట్టు ఏర్పాటు చేశామన్నారు. ఇక్కడి శిక్షణ గురించి , సదుపాయాల గురించి భూపతిరావు డిస్ట్రిక్ట్ స్పోర్ట్స్ డెవలప్‌మెంట్ ఆఫీసర్‌కు తెలియజేశారు. లథ్లెటిక్ కోచ్‌లు శివ, కాశీరావు పాల్గొన్నారు.



ఇందిరాగాంధీ నగర్‌లో ఎక్కడి చెత్త అక్కడే

చెత్తతొలగింపు అసంపూర్తి

ప్రజాశక్తి- కర్నూలు కార్పొరేషన్

ప్రజాశక్తిలో ఇందిరా గాంధీ నగర్ చెత్తమయం అనే వార్తకు స్పందించి అధికారులు ఫొక్లెయిన్‌తో చెత్తను తొలగిస్తున్నట్లు అధికారులు నటించారు. ఒకపొక్లెయిన్‌తో కాలువ దగ్గరకు జారిన చెత్తనంతా పైకి తోసి వెళ్లిపోయారు. అలా చేయడం వల్ల ఎలాంటి ప్రయోజనం లేదని స్థానికులు అంటున్నారు.వర్షం పడినా గాలి వీచినా మళ్ళీ అదే కిందికి జారి మళ్లీ కాలువలోకి పడే అవకాశం ఉంది. నగరపాలక సంస్థ అధికారులు అక్కడ ఉన్న చెత్తను అంతా ట్రాక్టర్లు ద్వారా అక్కడి నుంచి పూర్తిస్థాయిలో తొలగించాలని స్థానికులు కోరుతున్నారు. అంతేకాక ఇక్కడ చెత్త వేస్తే జరిమానా తప్పదనే హెచ్చరికలు చేసే బోర్డుకు పెట్టి ఉంచాలన్నారు. ఆ ప్రాంతంలో సిసి కెమెరా ఏర్పాటు చేయాలని, ఆ ప్రాంత కార్పొరేటర్, సంబందిత అధికారులు ఎప్పటికప్పుడు తమ వార్డు పరిధిలోని అన్ని ప్రాంతాలు తిరుగుతూ ఎక్కడ సమస్య ఉన్నా వెంటనే అధికారుల దృష్టికి తీసుకువెళ్లి శుభ్రం చేయించి ప్రజల ఆరోగ్యాలను కాపాడాల్సిన బాధ్యత ఎంతైనా ఉంది.

పిల్లల పట్ల తల్లిదండ్రులు అప్రమత్తంగా ఉండాలి

-పత్తికొండ జూనియర్ సివిల్ జడ్జి ఎంఎస్.భారతి

ప్రజాశక్తి-పత్తికొండ

పిల్లల పట్ల తల్లిదండ్రులు అప్రమత్తంగా ఉండాలని జూనియర్ సివిల్ జడ్జి ఎంఎస్.భారతి అన్నారు. 'అంతర్జాతీయ మిస్సింగ్ చిల్డ్రన్స్ డే' సందర్భంగా శనివారం పత్తికొండ పట్టణంలోని కోర్టు ఆవరణంలో మండల న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా హాజరైన జస్టిస్ భారతి మాట్లాడుతూ.... పిల్లలు చిన్న పాటి కారణాలతో తల్లిదండ్రులలో గొడవపడి , ఇల్లు వదిలేసి వెళ్తున్నారన్నారు. దేశంలోనే మన రాష్ట్రంలో ప్రతి ఏటా మిస్సింగ్ చిల్డ్రన్స్ కేసులు పెరుగుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. మిస్సింగ్ చిల్డ్రన్ కేసులలో 71 శాతం ఆడపిల్లలు ఉండటం మరింత బాధాకరమని అన్నారు. ఇంట్లో నుంచి వెళ్లిన పిల్లలు బయట వేధింపునకు గురి అవుతున్నారని, అసాంఘిక కార్యకలపాలకు పాల్పడే వారి చేతుల్లో పావులుగా మారుతున్నారని అన్నారు. యుక్త వయస్సుకు వచ్చిన పిల్లల ప్రవర్తనను తల్లిదండ్రులు గమనిస్తూ ఉండాలన్నారు. పిల్లలను మంచి పౌరులుగా పెంచాల్సిన సామాజిక బాధ్యత తల్లిదండ్రులపై ఉందన్నారు. ఈ కార్యక్రమంలో బార్‌అసోసియేషన్ అధ్యక్షుడు బి.రంగస్వామి, ప్రధాన కార్యదర్శి మహేశ్, న్యాయవాదులు మైరాముడు, ఈరన్న, రవి ప్రకాష్, బాలబాష, ప్రసాద్ బాబు, వీరేష్, లోక్ అదాలత్ సిబ్బంది రవణమ్మ, ప్రసాద్, కక్షిదారులు, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.



సదస్సులో మాట్లాడుతున్న పత్తికొండ జూనియర్ సివిల్ జడ్జి ఎంఎస్.భారతి

18 నుంచి మాస్టర్స్ అకాడమీలో నీట్ తొలిబ్యాచ్ ప్రారంభం

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

కర్నూలు మద్దూర్‌నగర్‌లోని మాస్టర్స్ జూనియర్ కాలేజ్ , మాస్టర్స్ అకాడమీలో 2025 సంవత్సరం నీట్ పరీక్షరాసే విద్యార్థులకు జూన్ 18 నుండి మొదటి బ్యాచ్ ప్రారంభమవుతుందని డీన్ జ్ఞాన ప్రసాద్ తెలిపారు. ఆయన మాట్లాడుతూ 2025 సంవత్సరం నీట్ పరీక్షరాసే విద్యార్థులకు విజయవాడ, హైదరాబాద్ , బెంగళూరు నుండి వచ్చిన 10 ఏళ్ల కు పైగా అనుభవం గల లెక్చరర్లు ఉన్నారని తెలిపారు. అబ్బాయిలకు , అమ్మాయిలకు విడివిడిగా హాస్టల్ సౌకర్యం ఉందని తెలిపారు. తమ దగ్గర చదివే విద్యార్థులు ఎలాంటి ట్యూషన్స్ మీద ఆధార పడాల్సిన అవసరం లేదని అన్నారు. ఎలాంటి ఒత్తిడి లేని వాతావరణంలో కౌన్సిలర్స్ సహాయంతో చదువు కునే అవకాశం ఉందన్నారు. నీట్ లాంగ్ టర్మ్, ఇంటర్మీడియట్ ఎంపిసిలో ఇంటిగ్రేటెడ్ (జెఇఇ) మెయిన్స్ అండ్ అడ్వాన్స్‌డ్ బైపిసిలో ఇంటిగ్రేటెడ్ (నీట్) , ఎంఇసి , సిఇసి కూడా ఉన్నాయని తెలిపారు. అడ్మిషన్లు జరుగుతు న్నాయని ఈ అవకాశాన్ని ప్రతి ఒక్క. విద్యార్థి ఉపయోగించుకుంటారని ఆశాభావం వ్యక్తం చేశారు.





సమస్యలు వివరిస్తున్న దూదెకొండ ఎంపిటిసి ఈరన్న

సప్పగా సాగిన సర్వసభ్య సమావేశం

ప్రజాశక్తి-పత్తికొండ

పత్తికొండ మండల పరిషత్ కార్యాలయంలో ఎంపిపి నారాయణదాసు అధ్యక్షతన శనివారం నిర్వహించిన మండల సర్వసభ్య సమావేశం సప్పగా సాగింది. అధికారులు, ప్రజాప్రతినిధులు మొక్కబడిగా సర్వసభ్య సమావేశానికి హాజరయ్యారు. ఎంపిపి నారాయణదాసు మాట్లాడుతూ వర్షాకాలంలో డ్రైనేజీ వ్యవస్థలు, పరిసరాలను పరిశుభ్రంగా ఉండే విధంగా పంచాయతీ సెక్రటరీలు చర్యలు తీసుకోవాలని అన్నారు. మలేరియా, డెంగ్యూ, అంటు రోగాలపై ప్రజలకు అవగాహన కల్పించడంలో డాక్టర్లు పూర్తిగా విఫలం చెందారని అగ్రహం వ్యక్తం చేశారు. దూదేకొండ ఎంపిటిసి పెద్ద ఈరన్న కరువు నష్టపరిహారం కొందరి రైతులకే జమఅయ్యాయని మిగతా రైతులకు జమ కాలేదని సభ దృష్టికి తీసుకొచ్చారు. వ్యవసాయ అధికారి వెంకట్ రాముడు స్పందిస్తూ రైతులందరికీ సకాలంలో నష్టపరిహారం అందే విధంగా చర్యలు తీసుకుంటామని అన్నారు. ఈ సమావేశంలో ఎంపిడిఒ రామారావు ,కో ఆప్షన్ మెంబర్ నజీర్ తదితరులు పాల్గొన్నారు.



అల్లర్లు సష్టిస్తే చర్యలు : సిఐ

ప్రజాశక్తి-పత్తికొండ

గ్రామాలలో ఎవరైనా అల్లర్ల గొడవలు సృష్టిస్తే అలాంటి వారిపై చట్టపరమైన చర్యలు చేసుకుంటామని పత్తికొండ అర్బన్ సిఐ మురళీమోహన్ పేర్కొన్నారు. శనివారం పత్తికొండ మండలం అటికల గుండు గ్రామంలో డిఎస్‌పి శ్రీనివాస్ రెడ్డి ఆదేశాల మేరకు పత్తికొండ అర్బన్ సిఐ మురళీమోహన్ ఆధ్వర్యంలో పోలీసులు కార్డెన్ సెర్చ్ నిర్వహించారు. మూడు లీటర్ల నాటసారాను స్వాధీనం చేసుకుని ఒక వ్యక్తిని అరెస్ట్ చేసామన్నారు. సరైన పత్రాలు లేని 10మోటార్ వెహికల్‌క్స సీజ్ చేసినట్లు తెలిపారు. జూన్ 4 ఎన్నికల ఫలితాల దృష్ట్యా గ్రామాల్లో ఎవరు గొడవలు పడకుండా శాంతి భద్రతలకు విఘాతం కలవకుండా ఉండాలని అన్నారు. ప్రజలందరూ పోలీసులు సహకరించాలని కోరారు. కార్యక్రమంలో పత్తికొండ ఎస్ఐ గోపాల్ ప్రవీణ్ కుమార్ రెడ్డి మద్దికేర, తుగ్గలి, జొన్నగిరి పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

ఆస్తితగాదాలో వ్యక్తిపై దాడి

సి బెళగల్ : సిబెళగల్ మండలం యనగండ్లలో ఆస్తితగాద విషయంలో వ్యక్తిపై దాడి చేసి గాయపరిచినట్లు ఎస్ఐ తిమ్మారెడ్డి తెలిపారు. శనివారం ఘటనపైవిచారించారు. బాధితుడు రమేష్ నాయుడు (51)కు బోయ రామలింగంకు ఆస్తి విషయంలో మనస్పర్థలు ఉన్నాయి. రమేష్ నాయుడు పొలంలో ఉండగా గొడవ కాస్త పెద్దగా కావడంతో అక్కడే ఉన్న రామలింగం, రవి కుమార్, రాంబాబు కలిసి రమేష్ నాయుడు తలపై కొట్టి తీవ్రంగా గాయపరిచారు. కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తిమ్మారెడ్డి పేర్కొన్నారు.

అపరిశుభ్రత నడుమ తాగునిటి పథకం

మారందొడ్డిలో కానరాని చర్యలు

ప్రజాశక్తి -సి బెళగల్



అపరిశుభ్రంగా తాగునీటి ట్యాంకు

సి బెళగల్ మండలం మారందొడ్డిలో తాగునిటి పథకం అపరిశుభ్రత నడుమ దర్శన మిస్తోంది. చుట్టూ పాచి పేరుకొని పోయి, చెత్త చెదారం నిండుకొని ఉండటంతో నీళ్లు పట్టుకొనేందుకు ప్రజలు అవస్థలుపడుతున్నారు. అధికారులకు పలుమార్లు తెలిపినా పట్టించుకోవడం లేదని కనీసం ప్రాథమిక చర్యలు చేపట్టి అక్కడ బ్లీచింగ్ పౌడర్ లాంటివి చల్లిన పాపానలేదని ప్రజలు వాపోతున్నారు. అంతేకాకుండా ట్యాంకును నెలలుగా శుభ్రం చేసిన ఆనవాలులేవని తెలిసింది. తప్పని పరిస్థితుల్లో ఆ నీటినే తాగాల్సి వస్తుందని మహిళలు పేర్కొంటున్నారు. సురక్షితమైన నీరు కరవైనట్లు వార్తలు వినిపిస్తున్నాయి. ఇప్పటికైనా అధికారులు దృష్టి సారించాలంటున్నారు.

రాబోయేది జగన్ ప్రభుత్వమే

- ఆదోని ఎమ్మెల్యే సాయి ప్రసాద్ రెడ్డి

ప్రజాశక్తి - కౌతాళం

రాబోయేది జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వమేనని, జూన్ 9న ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేసేది ఖాయమని ఆదోని ఎమ్మెల్యే వై.సాయిప్రసాద్ రెడ్డి పేర్కొన్నారు. శనివారం మండలంలోని శ్రీనరసింహ ఉరుకుంద ఈరన్న స్వామి, శ్రీబుడుముల దొడ్డి ఆంజనేయస్వామి, శ్రీజగద్గురు ఖాదర్ లింగస్వామి దేవాలయాలను సందర్శించి పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. గత ఐదేళ్ల పాలనలో ప్రజలకు మంచి చేశామని, ప్రజలు వైసిపికే ఓటు వేశారని తెలిపారు. జిల్లాలో 7 అసెంబ్లీ నియోజకవర్గాల్లో వైసిపి అభ్యర్థులు గెలుస్తారని ధీమా వ్యక్తం చేశారు. జగన్ పాలనలో అందరూ బాగుండాలని, వర్షాలు బాగా కురవాలని, రైతులు మంచి పంటలు పండించాలని దేవాలయాల్లో పూజలు చేశామన్నారు. శ్రీజగద్గురు ఖాదర్ లింగ స్వామి దర్గ ధర్మకర్త సయ్యద్ మున్నా పాషా చిస్తి సాయి ప్రసాద్ రెడ్డిని శాలువా, పూలమాలలతో సన్మానించారు. వైసిపి నాయకులు చంద్రకాంత్ రెడ్డి, మర్రి స్వామి, మహేందర్ రెడ్డి, కౌతాళం సర్పంచి పాల్ దినకరన్, మాజీ సర్పంచి అవతారం, నాయకులు రాఘవేంద్ర రెడ్డి, ఎంకోబా, రాముడు, బాష, ఆనంద్, పూజారి లింగన్న, వీరేశప్ప, మోహిద్దీన్, ఉలిగయ్య, ఉపేంద్ర పాల్గొన్నారు.


ఆలయ ప్రాంగణంలో ఉన్న సాయి ప్రసాద్ రెడ్డి

పిల్లల అపహరణపై అప్రమత్తత అవసరం

- 2వ అదనపు న్యాయమూర్తి సాయి శ్రీవల్లి

ప్రజాశక్తి - ఆదోని

పిల్లలు అపహరణకు గురికాకుండా అప్రమత్తంగా ఉండాలని 2వ అదనపు న్యాయమూర్తి సాయి శ్రీవల్లి, 1వ పట్టణ సిఐ తేజామూర్తి తెలిపారు. అంతర్జాతీయ పిల్లల అపహరణ దినోత్సవం సందర్భంగా శనివారం స్థానిక బోయగేరిలో మండల న్యాయ సేవా అధికార సంస్థ ఆధ్వర్యంలో తల్లిదండ్రులకు అవగాహన సదస్సు ఏర్పాటు చేశారు. ముఖ్య అతిథిగా సాయి శ్రీవల్లి, సిఐ తేజామూర్తి హాజరయ్యారు. ఈ సందర్భంగా న్యాయమూర్తి శ్రీవల్లి మాట్లాడారు. పిల్లలకు మంచి విద్యాబుద్ధులు, నడవడిక నేర్పించాలని తెలిపారు. సిఐ తేజామూర్తి మాట్లాడుతూ... పిల్లలను అపహరించి డబ్బులు డిమాండ్ చేస్తారని తెలిపారు. కొంతమంది భిక్షాటన చేయించి సొమ్ము చేసుకుంటారని చెప్పారు. సీనియర్ న్యాయవాది లోకేష్ కుమార్ మాట్లాడుతూ... మండల సేవా సంస్థ ఆధ్వర్యంలో ఉచిత న్యాయ సేవలు ఉపయోగించుకోవాలని కోరారు. జూనియర్ న్యాయవాదులు హుస్సేన్ సాని, కల్యాణ్ రెడ్డి, శ్రీధర్ సింగ్, ఈరన్నలు చిన్న పిల్లలు ఎదుర్కొంటున్న సమస్యలపై తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు.


సదస్సులో మాట్లాడుతున్న న్యాయ మూర్తి శ్రీవల్లి

నకిలీ విత్తనాలు విక్రయిస్తే చర్యలు

- ఎఒ సురేష్‌బాబు

ప్రజాశక్తి- దేవనకొండ

ఖరీఫ్ సీజన్ ప్రారంభం కావడంతో విత్తన దుకాణాల్లో రైతులకు నాణ్యమైన విత్తనాలు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకున్నామని, నకిలీ పత్తి విత్తనాలు విక్రయిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఎఒ సురేష్ బాబు హెచ్చరించారు. శనివారం దేవనకొండలోని విత్తన దుకాణాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. విత్తన దుకాణాల్లో అన్ని రకాల విత్తనాల శాంపిల్స్ సేకరించామని తెలిపారు. వాటిని పరీక్ష నిమిత్తం ల్యాబ్‌కు పంపామన్నారు. అదేవిధంగా సబ్సిడీపై అందించే వేరుశనగ విత్తనాలను అన్ని ఆర్‌బికెల్లో ఉంచామని తెలిపారు. 2,400 క్వింటాళ్ల వేరుశనగ విత్తనాలు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకున్నామని చెప్పారు. గతేడాది నెలకొన్న వర్షాభావ పరిస్థితుల నేపథ్యంలో కరువు పరిహారం కింద 23,582 మంది రైతులకు రూ.37.7 కోట్లు బ్యాంకు ఖాతాలో జమ అయినట్లు తెలిపారు. రైతులకు విత్తన కొనుగోలుకు, పంట పెట్టుబడుల కోసం ఎంతో ఉపయోగకరంగా ఉన్నట్లు పేర్కొన్నారు.


విత్తన దుకాణాన్ని తనిఖీ చేస్తున్న ఎఒ

గెలుపుపై ఉత్కంఠ

ప్రజాశక్తి-కర్నూలు ప్రతినిధి

ఉమ్మడి కర్నూలు జిల్లాలోని రెండు పార్లమెంట్, 14 అసెంబ్లీ నియోజకవర్గాలకు ఈ నెల 13న పోలింగ్ నిర్వహించిన విషయం తెలిసిందే. పోలైన ఓట్లకు సంబంధించిన వివరాలన్నీ ఇవిఎంల్లో నిక్షిప్తమయ్యాయి. కర్నూలు జిల్లాకు సంబంధించిన కర్నూలు పార్లమెంట్, ఆదోని, ఆలూరు, పత్తికొండ, మంత్రాలయం, ఎమ్మిగనూరు, కోడుమూరు, కర్నూలు, పాణ్యం అసెంబ్లీ నియోజకవర్గాల ఇవిఎంలను రాయలసీమ యూనివర్సిటీలో భద్రపరిచారు. నంద్యాల జిల్లాకు సంబంధించిన నంద్యాల పార్లమెంట్, నంద్యాల, ఆళ్లగడ్డ, బనగానపల్లె, డోన్, శ్రీశైలం, నందికొట్కూరు అసెంబ్లీ నియోజకవర్గాల ఇవిఎంలను నంద్యాల ఆర్‌జిఎం, శాంతిరాం కళాశాలల్లో భద్రపరిచారు. వీటి కోసం ప్రత్యేకంగా స్ట్రాంగు రూములను ఏర్పాటు చేశారు. పాణ్యం నియోజకవర్గానికి సంబంధించిన ఇవిఎంలను రాయలసీమ యూనివర్సిటీలోని ఇంజనీరింగ్ బ్లాక్‌లో భద్రపరిచారు. కర్నూలు నియోజకవర్గానికి సంబంధించిన ఇవిఎంలను రాయలసీమ యూనివర్సిటీలోని లైఫ్ సైన్సెస్ బ్లాక్‌లో భద్రం చేశారు. పత్తికొండ నియోజకవర్గానికి సంబంధించిన ఇవిఎంలను రాయలసీమ యూనివర్సిటీలోని లైబ్రరీ బ్లాక్‌లో భద్రపరిచారు. కోడుమూరు నియోజకవర్గానికి సంబంధించిన ఇవిఎంలను రాయలసీమ యూనివర్సిటీలోని ఇంజనీరింగ్ బ్లాక్‌లో భద్రం చేశారు. ఎమ్మిగనూరు నియోజకవర్గానికి సంబంధించిన ఇవిఎంలను రాయలసీమ యూనివర్సిటీలోని ఇంజనీరింగ్ బ్లాక్‌లో భద్రపరిచారు. మంత్రాలయం నియోజకవర్గానికి సంబంధించిన ఇవిఎంలను రాయలసీమ యూనివర్సిటీలోని లైబ్రరీ బ్లాక్‌లో భద్రం చేశారు. ఆదోని నియోజకవర్గానికి సంబంధించిన ఇవిఎంలను రాయలసీమ యూనివర్సిటీలోని లైఫ్‌సైన్సెస్ బ్లాక్‌లో, ఆలూరు నియోజకవర్గానికి సంబంధించిన ఇవిఎంలను రాయలసీమ యూనివర్సిటీలోని ఇంజనీరింగ్ బ్లాక్‌లో భద్రపరిచారు. స్ట్రాంగు రూముల పక్కనే ఓట్ల లెక్కింపు కేంద్రాలను ఏర్పాటు చేశారు. నంద్యాల జిల్లాలోని శ్రీశైలం, నందికొట్కూరు నియోజకవర్గాలకు సంబంధించిన ఇవిఎంలను ఆర్‌జిఎం ఇంజనీరింగ్ కళాశాలలో భద్రపరిచారు. ఆళ్లగడ్డ, బనగానపల్లె, నంద్యాల నియోజకవర్గాలకు సంబంధించిన ఇవిఎంలను శాంతిరాం ఇంజనీరింగ్ కళాశాలలో భద్రంచేశారు. డోన్ నియోజకవర్గానికి సంబంధించిన ఇవిఎంలను శాంతిరాం ఫార్మసీ కళాశాలలో భద్రపరిచారు. 4న చేపట్టనున్న ఓట్ల లెక్కింపుతో అభ్యర్థుల భవితవ్యం ఏంటో తేలనుంది. ఎవరు గెలుస్తారన్న ఉత్కంఠ అభ్యర్థుల్లో నెలకొంది.

గతుకులు..గుంతలు : గ్రామీణ రోడ్ల నుంచి ప్రధాన రహదారుల వరకూ అది ఏ రోడ్లయినా గుంతలు, గతుకులు కనిపించడం సాధారణం అయిపోయింది. వర్షాకాలం చిన్నపాటి వర్షానికి గుంతలు, బురదమయంగా మారుతున్న రహదారులు ఎండాకాలంలో కంకర తేలి గుంతలు, గతుకులతో దర్శనమిస్తున్నాయి. అధ్వాన్నంగా మారి వాహనదారులను తీవ్ర ఇబ్బందులకు గురి చేస్తున్నాయి. పాలకులు అవే రోడ్లల్లో వెళుతున్నా వాటి మరమ్మతులు, కొత్త రోడ్ల మీద దృష్టి సారించడం లేదు. కర్నూలు, నంద్యాల రెండు జిల్లాలు కలిపి 3,621.408 కిలోమీటర్ల మేర రోడ్లు ఉన్నాయి. వాటిలో 3,248 కిలో మీటర్ల బిటి రోడ్లు, 258.13 కిలోమీటర్ల సిసి రోడ్లు, 7.7 కిలోమీటర్ల మెటల్ రోడ్లు, 107.05 కిలో మీటర్ల అన్ మెటల్ రోడ్లు ఉన్నాయి. సగానికి పైగా రోడ్లన్నీ రాళ్లు తేలడం, బురదమయంగా మారడంతో ఆయాదారుల గుండా ప్రయాణం చేసేందుకు వాహనదారులు, ప్రజలు నానా అవస్థలు పడాల్సి వస్తోంది. తరచూ పాడయిన రోడ్లల్లో ప్రయాణించడం వల్ల వాహనదారులు వెన్ను, మెడ సంబంధ రోగాల భారిన పడుతున్నారు.

రాయితీ విత్తనాల్లో కోత : ఇప్పటికే చిరు జల్లులు పలకరించాయి. కొద్ది రోజుల్లో ఖరీఫ్ సీజన్ ఆరంభం కానుంది. కర్షకులు దుక్కులు దున్నుతున్నారు. విత్తనాలు సమకూర్చుకొనే పనిలో పడ్డారు.. ఖరీఫ్ సీజన్‌కు అవసరమైన రాయితీ విత్తనాలను సిద్ధం చేసేందుకు వ్యవసాయశాఖ ఏపీ సీడ్స్‌కు అప్పగించింది. ప్రభుత్వం రాయితీ విత్తనాలపై కోత విధించి రైతులపై భారం మోపింది. ఉమ్మడి జిల్లాకు 24,281 క్వింటాళ్లు కేటాయించారు. గతేడాది ఖరీఫ్ రాయితీ విత్తనాలతో పోలిస్తే కర్నూలు జిల్లాకు 2,981 క్వింటాళ్లు, నంద్యాలకు 207 క్వింటాళ్ల రాయితీ విత్తనాలు తగ్గించారు.

కొండెక్కిన కూరగాయలు : కూరగాయల ధరలు మండిపోతున్నాయి. సాధారణంగా వేసవిలో టమాటాల ధర మాత్రమే పెరగడం చూస్తుంటాం. కానీ ప్రస్తుతం అన్ని రకాల కూరగాయల రేట్లు చుక్కల్లో చేరాయి. రాష్ట్రంలో ఎండల తీవ్రత అధికంగా ఉండటంతో పాటు వర్షాలు సరిగ్గా లేకపోవడంతో పంట ఉత్పత్తి గణనీయంగా తగ్గిపోయింది. దీంతో అన్నిరకాల ధరలకు రెక్కలొచ్చాయి. నలుగురు ఉన్న కుటుంబంలో ఒక్కరోజు కూరగాయలకు కనీసం రూ.150పైనే ఖర్చు చేయాల్సిన పరిస్థితి ఏర్పడింది.



మార్కెట్ యార్డు వ్యాపారి ఐపి

ప్రజాశక్తి-ఆదోనిరూరల్

ఆదోని వ్యవసాయ మార్కెట్ యార్డులో ఓ వ్యాపారి ఐపి పెట్టిన విషయం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. రూ.50 లక్షల విలువకు ఐపీ పెట్టాడు. మార్కెట్ యార్డులో 12 మంది కమీషన్ ఏజెంట్లతో పాటు మార్కెట్ యార్డు కార్యాలయానికి, నాలుగు బ్యాంకులకు ఐపి నోటీసులు పంపినట్లు సమాచారం. ఈనెల 22న ఐపి నోటీస్ పంపినట్లు తెలిసింది. ఐపి పెట్టిన వ్యాపారి తన పేరు మీద కాకుండా, తన అన్న పేరు మీద వ్యాపారం చేస్తుండడం విశేషం. తన వద్ద రెండు షర్ట్స్, రెండు ప్యాంట్లు మాత్రమే ఉన్నట్లు ఐపి నోటీసులో పేర్కొన్నాడు. విషయం తెలిసి మార్కెట్ యార్డులో కమీషన్ ఏజెంట్లు, తోటి వ్యాపారులు తీవ్ర కలవరపాటుకు గురయ్యారు. ఇదే వరుసలో ఐదు, ఆరుగురు వ్యాపారులు ఉన్నట్లు సమాచారం. వీరంతా స్థానికంగా ఊళ్లో లేకుండా అదృశ్యమయ్యారు. అప్పులు ఇచ్చిన కమీషన్ ఏజెంట్లు, రైతులు లబోదిబోమంటున్నారు. మార్కెట్ యార్డుకు రావాల్సిన సెస్‌కు సైతం పంగనామం పెట్టారు.

ఐఎన్ఐ సెట్‌లో ఆదోని వాసి ప్రతిభ

ప్రజాశక్తి - ఆదోని

దేశవ్యాప్తంగా జరిగే ఐఎన్ఐ సెట్ మెడికల్ పిజి ప్రవేశ పరీక్షలో ఆదోనికి చెందిన డాక్టర్ జి.శ్రీనివాస్తవ్ ప్రతిభ చాటి ఆల్ ఇండియా 65వ ర్యాంకు సాధించారు. శనివారం ఆదోనిలో ఆయనను పలువురు అభినందించారు ఈ సందర్భంగా శ్రీనివాస్తవ్ విలేకరులతో మాట్లాడారు. 2018లో ఎపి ఎంసెట్‌లో 2వ, తెలంగాణ ప్రభుత్వం నిర్వహించిన టిఎస్ ఎంసెట్‌లో 6వ, నీట్ యుజిలో 57వ ర్యాంకు సాధించినట్లు తెలిపారు. తాను కార్డియాలజిస్ట్‌గా సేవలందించడమే లక్ష్యమన్నారు. ఆదోని నారాయణలో 10, హైదరాబాద్ చైతన్యలో ఇంటర్ పూర్తి చేశానని వివరించారు.



వేరుశనగ విత్తనాలు పంపిణీ

ప్రజాశక్తి - హాలహర్వి

రైతులకు ఖరీఫ్-2024కు సంబంధించిన కె6 రకం వేరుశనగ విత్తనాలను హాలహర్వి మండలంలోని రైతులకు 205 క్వింటాళ్లు పంపిణీ చేశారు. ముందస్తు వర్షాలు కురవడంతో రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. రైతులు చాలామంది పత్తి పంట వేయకుండా (పంట మార్పిడి) వేరుశనగ పంట వేయడానికి ముందుకు వస్తున్నారు. మండలంలోని రైతు భరోసా కేంద్రాల్లో ఎఒ శివశంకర్ ఆదేశాల మేరకు శనివారం వేరుశనగ విత్తనాల పంపిణీ చేపట్టారు. ఎఒ శివశంకర్ మాట్లాడుతూ... అర్హులైన ప్రతి రైతుకు వేరు శనగ విత్తనాలు అందుతాయని, ఎవరూ ఆందోళన చందవద్దని తెలిపారు.


విత్తనాలు పంపిణీ చేస్తున్న అధికారులు


మృతదేహాన్ని పరిశీలిస్తున్న పోలీసులు

రైలు కింద పడి వ్యక్తి ఆత్మహత్య

ప్రజాశక్తి - ఆదోని

రైలు కిందపడి వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న సంఘటన ఆదోని, ఇస్వీ ఆర్ఎస్ మధ్య 498/25-23 వద్ద అప్‌లైన్ మధ్యలో శనివారం చోటు చేసుకుంది. ఆర్‌పి హెడ్ కానిస్టేబుల్ సాయి సర్వేశ్వరరావు వివరాల మేరకు... ఆదోని పట్టణానికి చెందిన శెట్టి బలిజ హరి ప్రసాద్(30) రైలు కిందపడి ఆత్మహత్యకు పాల్పడ్డారని తెలిపారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామని చెప్పారు. పూర్తి వివరాలు పోలీసు దర్యాప్తులో తెలియాల్సి ఉంది.

ప్రముఖ వైద్యుడు పుల్లయ్య మృతి

ప్రజాశక్తి-ఆదోనిరూరల్

ఆదోనిలో ప్రముఖ వైద్యులు, సీనియర్ న్యాయవాది పుల్లయ్య శనివారం మృతి చెందారు. ఆయన మృతికి పలువురు వైద్యులు, న్యాయవాదులు సంతాపం ప్రకటించారు. ఆయన అందించిన సేవలను కొనియాడారు. ఆదోనిలో మొట్టమొదటి ఆర్థోపెడిక్ డాక్టర్‌గా పేరుగాంచి వైద్య సేవలు అందించినట్లు పేర్కొన్నారు.



ఉరుములు, మెరుపులతో

గాలి వాన బీభత్సం

ప్రజాశక్తి - గోనెగండ్ల

మండలంలో శుక్రవారం రాత్రి 42.6 మిల్లీమీటర్ల వర్షం కురిసింది. ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం గోనెగండ్లతో పాటు మండలంలోని వివిధ గ్రామాల్లో బీభత్సం సృష్టించింది. భారీగా మెరుపులు, ఉరుముల శబ్దాలకు భారీ వృక్షాలు, విద్యుత్ స్తంభాలు నేలకూలాయి. విద్యుత్ తీగలు తెగి ట్రాన్స్‌ఫార్మర్లు కింద పడిపోయాయి. ప్రజల రాకపోకలు, విద్యుత్ సరఫరాకు అంతరాయం వాటిల్లింది. వెంటనే రంగంలోకి దిగిన విద్యుత్ సిబ్బంది బృందాలుగా విడిపోయి ఎక్కడికక్కడ రోడ్డుకు అడ్డగా పడిపోయిన వృక్షాలు, స్తంభాలను తొలగించారు. మరోపక్క లైన్లను పునరుద్ధరించే పనులు చేపట్టారు. హెచ్.కైరవాడి, పుట్టపాశం, వెముగోడు, ఐరన్‌బండ, గంజిహళ్లి, గోనెగండ్ల గ్రామాల్లో విద్యుత్ స్తంభాలు, చెట్లు నేలకూలాయి. గోనెగండ్లలోని ప్రభుత్వ ఆస్పత్రి ఆవరణలో స్తంభాలు విరిగిపోయి ట్రాన్స్‌ఫార్మర్ దిమ్మెపై కింద పడిపోయింది. గోనెగండ్ల, గంజిహళ్లి రహదారిపై పెద్ద పెద్ద వృక్షాలు రోడ్డుకు అడ్డంగా పడిపోయి రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. ఎల్ఎల్‌సి కాలువ బ్రిడ్జి సమీపంలో విద్యుత్ స్తంభం తీగలు రోడ్డుకు అడ్డంగా పడిపోవడంతో గంజిహళ్లి బస్సు రాత్రంతా రోడ్డుపైన నిలిచిపోయింది.

సుమారు రూ.80 లక్షల ఆస్తి నష్టం

మండలంలో 20 నుంచి 25 విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు, వందకు పైగా విద్యుత్తు స్తంభాలు నేలకొరిగి సుమారు రూ.80 లక్షల ఆస్తి నష్టం వాటిల్లి ఉంటుందని గోనెగండ్ల విద్యుత్ శాఖ ఎఇ సుధాకర్ రావు శనివారం తెలిపారు. ఒకటి, రెండు రోజుల్లో మండలంలోని అన్ని గ్రామాల నుంచి పూర్తి వివరాలు వస్తే ఈ నష్టం పెరిగే అవకాశం ఉందని ఆయన వివరించారు.

విద్యుత్ లేక అల్లాడిన జనం

ఉరుములు, మెరుపులకు విద్యుత్ అంతరాయం ఏర్పడడంతో జనం అల్లాడిపోయారు. శుక్రవారం సాయంత్రం 6 గంటల నుంచి శనివారం సాయంత్రం 6 గంటల వరకు 24 గంటల పాటు విద్యుత్ లేకపోవడంతో ఇళ్లలో చీకటి, ఉక్కపోత, తాగునీటి కొరతతో పాటు ఫోన్లలో ఛార్జింగ్ లేక జనం ఇబ్బందులు ఎదుర్కొన్నారు.


కూలిన ట్రాన్స్‌ఫార్మర్


గంజిహళ్లి రోడ్డులో కూలిన చెట్టు

ముగిసిన వేసవి విరామ తరగతులు

ప్రజాశక్తి - ఆదోని

పట్టణంలోని ఎస్‌కెడి కాలనీ సీయోను ప్రార్థన మందిరం ఆరు రోజులపాటు జరిగిన వేసవి విరామ బైబిల్ పాఠశాల తరగతులు శనివారం ముగిశాయి. ఉదయం 7 గంటలకు ప్రార్థన మందిరం నుంచి చిన్నారులు బైబిల్ వాఖ్యాలతో కూడిన కిరీటాలు ధరించి, ప్లకార్డులు చేపట్టి పురవీధుల్లో ర్యాలీ చేపట్టారు. చర్చి ఆవరణ నుంచి ఎమ్మిగనూరు సర్కిల్, ఎన్‌టిఆర్ విగ్రహం ఎస్‌కెడి కాలనీ మీదుగా చిన్నారులు భారీగా తరలివచ్చి ర్యాలీలో పాల్గొన్నారు. అనంతరం సంఘ కాపరి ఎ.తిమోతి మాట్లాడారు. క్రీస్తు చూపిన బాటలో నడవాలని సూచించారు. హైదరాబాద్‌కు చెందిన కెజియా, జేరుషా చిన్నారులకు క్రైస్తవ గీతాలు యాక్షన్ సాంగ్స్‌తో పాటు పప్పెట్ షో ద్వారా క్రైస్తవ సందేశాన్ని అందించారు. సంఘ పెద్దలు రమేష్, సామ్యేల్, జాషువా, రాజ్ కుమార్, మనోహర్ పాల్గొన్నారు.


పురవీధుల్లో చిన్నారుల ర్యాలీ

ప్రమాదవశాత్తు యువకుడు మృతి

- విండ్ పవర్ రెక్కలు ఎత్తే క్రేన్ కారుపై పడి దుర్మరణం

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు

విండ్ పవర్ క్రేన్ రెక్కలు కారుపై పడి యువకుడు మృతి చెందారు. వివరాలిలా ఉన్నాయి... కోడుమూరు మండలం ప్యాలకుర్తి గ్రామ సమీపంలో కర్నూలు, కోడుమూరు ప్రధాన రోడ్డు పక్కన పొలాల్లో విండ్ పవర్ ఫ్యాన్ ఏర్పాటుకు వినియోగించే పరికరాలను నిల్వ చేశారు. అక్కడ కంపెనీకి గొల్ల రామచంద్ర (35) తన సొంత కారును అద్దె ప్రాతిపదికన ఏర్పాటు చేశారు. శుక్రవారం సాయంత్రం భారీ గాలి వాన కురిసింది. ఆ సమయంలో క్రేన్ సహాయంతో విండ్ పవర్ ఫ్యాన్ రెక్కలను ఎత్తే ప్రక్రియ చేపట్టారు. క్రేన్‌కు కొద్ది దూరంలో గొల్ల రామచంద్ర తన కారును నిలుపుకొని కారులో కూర్చున్నారు. భారీ ఈదురు గాలులు, వర్షానికి క్రేన్ అదుపు తప్పి కారుపై పడింది. కారు నుజ్జునుజ్జయింది. రామచంద్ర కారులో ఇరుక్కు పోయారు. పక్కన ఉన్న కొందరు అతి కష్టం మీద రామచంద్రను బయటికి తీశారు. మెరుగైన వైద్యం కోసం కర్నూలుకు తరలిస్తుండగా మార్గ మధ్యంలో మృతి చెందారు. పరమాన్‌దొడ్డి గ్రామానికి చెందిన గొల్ల కిష్టన్న, అంజినమ్మ దంపతులకు ఒక కుమార్తె, ముగ్గురు కుమారులు ఉన్నారు. పెద్ద కుమారుడు హనుమంతు, (2వ కుమారుడు దస్తగిరి (పశువుల ఆస్పత్రిలో ఉద్యోగం), 3వ కుమారుడు రామచంద్ర ఉపాధి కోసం కోడుమూరులో నివాసం ఉంటూ కారును అద్దెకు నడుపుతున్నారు. రామచంద్రకు భార్య హనుమంతమ్మ, కుమారులు చిన్న, విజయ్ ఉన్నారు. మృతుడి కుటుంబానికి విండ్ పవర్ కంపెనీ యాజమాన్యం కొంత నగదు నష్టపరిహారం ఇచ్చేందుకు అంగీకారం తెలిపింది. కోడుమూరు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.


మృతి చెందిన గొల్ల రామచంద్ర


నుజ్జునుజ్జయిన కారు

ఎపిఆర్‌జెసి ప్రవేశ పరీక్షలో 'ప్రతిభ'

ప్రజాశక్తి - కౌతాళం

2024 మేలో జరిగిన ఎపిఆర్‌జెసి ప్రవేశ పరీక్షలో ప్రతిభ హైస్కూల్ విద్యార్థులు ప్రతిభ కనబరిచారు. ఎల్లయ్య (కాత్రికి) 74వ ర్యాంకుతో, నందకిషోర్ 80వ ర్యాంకుతో సత్తా చాటినట్లు పాఠశాల కరస్పాండెంట్ సయ్యద్ దూద్ బాష, పాఠశాల సెక్రటరీ సయ్యద్ మైనుద్దీన్ తెలిపారు. శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో కరస్పాండెంట్ సయ్యద్ దూద్ బాష మాట్లాడారు. అక్షరాస్యతలో వెనుకబడిన కౌతాళం మండలంలో విద్యార్థులను విద్యారంగంలో తీర్చిదిద్ది, పోటీ ప్రపంచంలో పోటీపడేలా కృషి చేస్తున్నామని పేర్కొన్నారు. ఏప్రిల్‌లో వచ్చిన పదో తరగతి ఫలితాలు, నేటి ఎపిఆర్‌జెసి ప్రవేశ పరీక్షల ఫలితాలు ఇందుకు నిదర్శనమని తెలిపారు. రాబోయే రోజుల్లో సాంకేతిక పరిజ్ఞానాన్ని దృష్టిలో పెట్టుకొని విద్యార్థుల విద్యాభివృద్ధికి తోడ్పాటు అందిస్తామని చెప్పారు. పట్టణాల్లోని కార్పొరేట్ పాఠశాలలకు ధీటుగా మధ్యతరగతి, రైతు కూలీల పిల్లలకు, మంచి నాణ్యమైన విద్యనందించి క్రమశిక్షణ, నైతిక విలువలు గల విద్యార్థులుగా తీర్చిదిద్దుతున్నట్లు తెలిపారు. సమాజంలో ఉన్నతంగా ఎదిగేలా చూడడమే ప్రతిభ హైస్కూల్ యాజమాన్యం లక్ష్యమని పేర్కొన్నారు. విద్యార్థుల తల్లిదండ్రులు కూడా సహకారాలు అందించాలని కోరారు.


విద్యార్థిని అభినందిస్తున్న యాజమాన్యం

ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన

ప్రజాశక్తి - ఆదోని

ఆదోనిలోని ఆర్ఎస్ నర్సింగ్ కళాశాల ఆధ్వర్యంలో శనివారం నిర్వహించిన ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన లభించిందని కళాశాల డైరెక్టర్ శివ రాముడు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఆర్ఎస్ నర్సింగ్, పారా మెడికల్ కళాశాల ఆధ్వర్యంలో ప్రతి నెలా ఉచిత వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కళాశాలలో జిఎన్ఎం, జనరల్ నర్సింగ్, డిప్లొమా ఇన్ మెడికల్ ల్యాబ్ టెక్నీషియన్, డిప్లొమా ఇన్ మల్టీపర్పస్ హెల్త్ అసిస్టెంట్ కోర్సులు ఉన్నాయన్నారు. ప్రభుత్వ ఉచిత సీట్లకు ముందుగానే రిజర్వేషన్ చేసుకున్న వారికి ఇస్తామని తెలిపారు. దూరప్రాంతాలకు వెళ్లి చదువుకునే అవసరం లేకుండా ఆదోనిలోనే ఈ కోర్సులు అందుబాటులో ఉన్నాయని కళాశాల అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ నరేష్ ఆచారి వెల్లడించారు. డాక్టర్ రాజు, సిబ్బంది హేమంత్, ప్రసన్న, ఆనంద్, శివప్రియ, కాంత్ పాల్గొన్నారు.


వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

పంచ రథోత్సవాలపై రాఘవేంద్రులు

ప్రజాశక్తి - మంత్రాలయం

ప్రముఖ ఆధ్యాత్మిక పుణ్యక్షేత్రమెన మంత్రాలయంలో కొలువైన శ్రీరాఘవేంద్రస్వామి పంచ రథోత్సవాల్లో ఊరేగి భక్తులకు కనువిందు చేశారు. శనివారం ఉత్సవ మూర్తి ప్రహ్లాద రాయులును వెండి గజారోహణం, కొయ్య, రజత, స్వర్ణ, నవరత్న రథోత్సవాల్లో ఉంచి మంగళ హారతులు ఇచ్చారు. మేళతాళాలు, మంగళ వాయిద్యాల నడుమ, భక్తజన సందోహం మధ్య సేవాదారులతో లాగించి వైభవంగా రథోత్సవాలను ఊరేగించారు. శ్రీమఠం అసిస్టెంట్ మేనేజర్ ఐపి.నరసింహ మూర్తి, సహాయక పిఆర్ఒ హొన్నొళ్లి వ్యాసరాజాచార్, ఇతర మఠం సిబ్బంది, సెక్యూరిటీ సిబ్బంది పాల్గొన్నారు.

శ్రీమఠంలో బిజెపి తమిళనాడు రాష్ట్ర అధ్యక్షులు అన్నమలై

ప్రముఖ ఆధ్యాత్మిక పుణ్యక్షేత్రమెన మంత్రాలయంలో కొలువైన రాఘవేంద్రస్వామిని బిజెపి తమిళనాడు రాష్ట్ర అధ్యక్షులు అన్నమలై దర్శించుకున్నారు. దర్శనార్థం ఆలయం చేరుకున్న వారికి శ్రీమఠం మేనేజర్ ఎస్‌కె.శ్రీనివాసరావు, అసిస్టెంట్ మేనేజర్ ఐపి.నరసింహ మూర్తి, సహాయకులు బింధు మాధవాచార్ స్వాగతం పలికారు. గ్రామ దేవత మంచాలమ్మను, రాఘవేంద్రస్వామి మూల బృందావనాన్ని దర్శించుకుని మంగళ హారతులు స్వీకరించారు. అనంతరం పీఠాధిపతులు శ్రీసుబుదేంద్రతీర్థులు వారికి శేష వస్త్రం అందజేశారు.



రథోత్సవంలో పాల్గొన్న భక్తులు

మొక్కలు నాటి సంరక్షిద్దాం

- సర్పంచి ప్రేమ్ కుమార్, ఇఒఆర్‌డి బాలన్న

ప్రజాశక్తి - చిప్పగిరి

భావితరాలకు స్వచ్ఛమైన గాలి, వర్షాలు రావాలంటే తప్పనిసరిగా అందరమూ మొక్కలు నాటి, అవి పెద్దగా అయ్యేంత వరకు సంరక్షించాలని సర్పంచి ప్రేమ్ కుమార్, ఇఒఆర్‌డి బాలన్న ప్రజలకు తెలిపారు. శనివారం నేమకల్లు గ్రామంలో సచివాలయ ప్రాంగణంలో ఇఒఆర్‌డి బాలన్న ఆధ్వర్యంలో మొక్కలు నాటే కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. రైతులు కూడా పొలాల చివరన మొక్కలు నాటి పెద్దవిగా చేసుకుంటే నీడతోపాటు, ప్రకృతి గాలి, పొలాలకు హద్దులుగా, వర్షాలు త్వరగా కురవడానికి ఆస్కారం ఏర్పడుతుందన్నారు. చెట్లు లేని పక్షంలో మనకు కలుషితమైన గాలి, రోగాలకు గురయ్యే ప్రమాదం ఏర్పడుతుందని తెలిపారు. ప్రతి ఒక్కరూ మొక్కఉ నాటి వాటిని సంరక్షిద్దామని ప్రజలను కోరారు. సచివాలయ అధికారులు పాల్గొన్నారు.


మొక్కలను నాటుతున్న సర్పంచి, ఇఒఆర్‌డి బాలన్న